# చెరువు దగ్గర...

అది పెద్ద చెరువు.

బుక్కరాయ సముద్రంవాళ్ళు బుక్కరాయ సముద్రం చెరువు అంటారు. కాని దేశంలో వాడుకేమో అనంతపురం చెరువనే—లింగప్ప చెప్పాడు. లింగప్పకి అన్నీ తెలుసు. రెండూళ్ళకి ఆనుకునే వుంటుందది.

గట్టుమీద నిల్చుంటే ఒకవైపున చెరువు గుట్టల్ని ఒరుసుకుంటూ, అలలు అలలుగా ఎగసిపడే అలవిగాని చైతన్యాన్ని యిముడ్చుకొంటున్న ఆనందసాగరం. గట్టుకు రెండోవేపున చూపుమేరంతా పచ్చనిపైర్లు. పైర్లనడుమ గుట్టలు. గుట్టల్లో గవులు. గవుల్లో మఠాలు. ఒక్కో దానికీ ఒక్కో చరిత్ర. "పెనకసెర్లకాడ గంపమల్లయ్య కొండలో గెవిలో నిమ్మకాయెత్తే యీ గెవిలో మఠానికి దొల్లుకొత్తుంది" ఇంకా చాలా చెప్పాడు లింగప్ప.

చెరువుగట్టుమీద గణేశుడికి గుడికట్టారు. చుట్టూ చెట్లు. కూర్చోడానికి రాతి అరుగులు. ఇంకా ముందుకివెళ్ళి ఆకాశంక్రింద నించోడం సుశీలమ్మకు యిష్టం. అక్కడ ఆమె మనసు విప్పారి, వికసించి, చెరువులోని నీళ్ళలాగా మహానందంలో సుళ్ళు తిరుగుతుంది. ఆ ఆనందానికి ఆకాశమే అవధి. స్వేచ్ఛలోకి ఎదిగిన మనసును గణేశుడి ము[illegible]ంచి నమస్కరిస్తుంది-ఇంటికి తిరిగివెళ్ళేప్పుడు.

ఇంటికి వెళ్ళగానే మనసు తిరిగి స్మశానంగా మారిపోతుంది. మృత్యు

దేవతనీడ ఆమెను ఆవరిస్తుంది. "నేను ఏ అనుభూతీ లేకుండా యిలానే వడిలి వాడిపోతాను" అనుకుంటుంది, నిస్పృహతో. ఏమో చెయ్యాలని, దేన్నోపొందాలని, ఏదో తపన. ఏమీ చెయ్యలేని నిరాశ. తనజీవితం తనదికానట్లు, ఎవరి బలవంతంమీదనో బ్రతుకుతున్నట్లు బాధ. జీవిత కాలంలో ముప్పైఅయిదేళ్ళు—చాలాభాగం గడచిపోయింది తెలీకుండానే. ఇహ చచ్చిపోవడం తరువాయి. బ్రతక్కుండానే చావు! ఆమెలోని నిజం జీవితాన్ని అనుభవించాలని, నవ్వాలని, ఏడవాలని, అందులో లీనమై పోవాలని ఆరాటపడుతూ, దాన్ని అందుకోలేక విడిగా నిలిచిపోయి, వ్యర్థంగా నశించిపోతున్నట్లు భావన కల్గుతుంది. తానేదో బలాత్కారానికి గురి అవుతున్నట్లు, ఎవరో తననుమోసం చేస్తున్నట్లు అనిపిస్తుంది. గడచిన జీవితం ఎడారిలాగా, ముందున్నది స్మశానంలాగా తోస్తున్నది.

"నాకేదో దయ్యం పట్టింది" అనుకుంటుంది ఒక్కోసారి. అయినా ఆ ఆలోచనలు ఆమెను ఒదలవు. కొంతకాలంనుంచీ ఆమెలో ఇలాంటి మార్పు వచ్చింది. తనలోని ఎవరో తనను చూచి నవ్వటం మొదలెట్టారు.

అంతకుముందు ఆమెలో ఏవిధమైన అసంతృప్తీ ఉండేదికాదు. ఆమె ఉత్తమురాలు. తరతరాలుగా మంచిని వెలార్చుతూవచ్చిన రక్తం ఆమె నరాల్లో ప్రవహిస్తున్నది. ఆమె పెద్దల్ని కాదనలేదు. భర్తను దైవసమానుడిగా ఎంచుకున్నది. కష్టాల్లో వుండేవాళ్ళ ఎడల దయాదాక్షిణ్యాలు చూపించింది. భగవంతుణ్ని ఎన్నోరూపాల్లో మహదానందంతో భావించుకున్నది. పూజించింది. ఆచారాల్ని అనుసరించింది. ఇంతకుమించి మరేదో కావాలని ఆమెకు తోచనేలేదు.

ఆమెభర్త గోపాలరావు కమర్షియల్ బాంకు నడుపుతూ బాగా సంపాదిస్తున్నాడు. సన్నని చురుకైన మొహం, మల్లెపువ్వుల్లాంటి బట్టలు, చెదరని క్రాపు, పరిసరాల్ని క్రమ్మివేసే ఫారిన్ యుడికొలోన్ వాసన-అతని లోని యీ లక్షణాలన్నీ ఆమెకు చాల ప్రియమైనవి.

అతను ఆమెకు బహిఃప్రాణము. అతన్ని చూసి ఆనందపడుతుంది.

గర్వపడుతుంది. అతనులేని జీవితం ఆమెకులేదు. అతనికి చిన్న జలుబు చేసినా, ఏమైపోతాడోనని భయపడి, అతనుక్షేమంగా వుంచేచాలని పరమేశ్వరుడికి మ్రొక్కుతుంది. అతను ఇంట్లోంచీ బయల్దేరినప్పటినుండి ఆమె మనసు భయంతో ఒణికిపోతుంది. బయల్దేరిన రైలు సవ్యంగా గమ్యం చేరునా? దోవలో ఎన్ని మలుపులు, ఎన్ని అవరోధాలు, ఎన్ని అపాయాలు! అన్నింటినీ తలచి తలచి భర్తక్షేమంకోసం ఎంతగానో ఆరాటపడి, తపించి, ధ్యానించి మ్రొక్కి, వెయ్యికళ్ళతో ఎదురుచూచి, అతను కనిపించగానే మహదానందంతో ఆహ్వానించి....ప్రతిక్షణమూ అతనికోసమే బ్రతుకుతుందామె.

"సీతా" అని పిలుస్తాడు గోపాలరావు ఏకాంతంలో.

సుఖంగా గడిచింది కాలం. ఆమెకు "అవసరాలు" అనేవిలేవు. గోపాలరావును ఆమె కోరింది ఒక్కటే—క్రొత్తగా కట్టిన ఇంట్లో ఎత్తు గోడలూ విశాలమైన గదులూ ఉండాలని. వైశాల్యంలేనిచోట ఆమె ఉక్కిరిబిక్కిరి అయిపోతుంది. మనసు కుంచించుకుపోయి, ఇరుకులో చిక్కుబడ్డట్లు విలవిల్లాడుతుంది. అది ఒక్క వూహగా కాకుండా నిజంగా, భౌతికంగా బాధిస్తుంది. అదొక్కటే ఆమె అవసరం.

ఇప్పుడు అంతామారిపోయింది. "ఏం, ఇన్నికష్టాలు—లేనివి—వూహిస్తున్నావేం? అతను బాగుండాలని లేదా?" "జలుబుకే మనుష్యులు చచ్చిపోతారా?" "నీ పాతివ్రత్యం పటిష్టం చేసుకోడానికి అతనిమీద లేనిపోని అపాయాలు రుద్దకు"—లోపల్నుంచీ నవ్వుతారు ఎవరో. ఆమె నిరుత్తరయై గాబరాపడుతుంది. పురాణకాలంనుంచీ మహాపతివ్రతలు పతినే సదా ధ్యానిస్తూ, అతని క్షేమంకోసమే అహర్నిశలూ భగవంతుని వేడుకుంటూ, తులసీమాతకు పూజలుచేస్తూ ఉండటం అందరికీ తెలిసిన విషయమే కదా! అయినా లోపల్నుంచీ పుట్టుకొస్తున్న వెక్కిరింపు ఆగలేదు. "నేను ఉత్తమురాల్ని" అన్న అహం ముక్కలైంది. "నేను ఏ తప్పు చేయలేదే. ఎందుకీ అసంతృప్తి? అనేక యుగాల్లోంచీ వెలుగులు చిమ్ముతూ వస్తున్న భారతీయ

జీవన విధానం ఉత్తమేడిపండు అయిందా? అందులో లోపం ఏర్పడిందా?" అనుకున్నది.

కడుపులో పుచ్చును దాచుకున్న మల్లెమొగ్గ ఈ మనసు అన్పిస్తున్న దామెకు.

"మనింట్లో ఆడపిల్లలు మగరాయుళ్ళలాగా చెట్లూ చేమలూ ఎక్కి తిరగరాదు" ఆ జామకాయలు తియ్యగా వుంటాయి. పళ్ళతో కసిక్కిన కొరికితే తియ్యని రసం వూరి వస్తుంది. ఆ కాయలకోసం మిగతా పిల్లలతో కలసి చెట్టెక్కిన ఏడేళ్ళ సుశీలను కట్టడిచేస్తున్నది వాళ్ళ నాయనమ్మ. అప్పణ్ణించీ ఆపిల్ల చెట్టెక్కలేదు. "మనింట్లో ఆడపిల్లలు ఒకరింటికి వెళ్ళరు" ఆపిల్ల వెళ్ళలేదు. సుశీలకి పైటలు వేసుకునే వయసు వచ్చినప్పుడు వాళ్ళ నాయనమ్మ చెప్పింది—"ఒక్కచోట వుమ్మేస్తే తుంపర్లు అన్ని వూళ్లల్లోకీ ఎగిరిపడ్తాయి. పేరు ఎట్లా నిలబెడతావో, జాగ్రత్త" సుశీలపేరు నిలబెట్టింది. ఫలానా ఇంటివారమ్మాయి బుద్ధిమంతురాలనిపించుకున్నది. ఆ ఇంట్లో పుట్టే ప్రతి ఆడపిల్లా ఒక ఉత్తమయిల్లాలు. "ఎప్పుడూ పొరపాటు రాకూడదు. తప్పు అనేదానికి నిష్కృతిలేదు. పేరు నిలబెట్టు జాగ్రత్త జాగ్రత్త!!!"—తెలివివచ్చినప్పట్నుంచీ వాళ్ళ జీవితాన్ని గురించి ఏర్పరచుకునే ముఖ్యసూత్రం యిదే. సుశీలమ్మ ఆ ఇంటిబిడ్డ.

పిల్లలు పుట్టకపోవటం యీ అసంతృప్తికి కారణమా? అనుకుని వెంటనే త్రోసిపుచ్చింది. లేనివాటికోసం బాధపడటం ఆమె తత్వంకాదు.

తన జీవితంమీద, తన మనసులో పుట్టే భావాలమీద, తన నమ్మకాలమీద, "తన" మీద వ్యతిరేకతలాంటి భావం పెరిగింది ఆమెలో. తన మనసే తనను నలిపివేస్తున్నట్లు, స్వేచ్ఛ అనేది తనకులేనట్లు ఉక్కిరి బిక్కిరి అవుతుంది. "మంచితనం" అన్న ముసుగు తననెందుకు ఆవరించింది! ఈ ముసుగులోంచీ వ్యవహరించడానికేగాని "జీవించ"డానికి తనకు హక్కులేదేల? "ఏపనిగాని సద్యస్ఫూర్తితో ఆనందంగా చెయ్యలేనా? అనుకుంటుంది.

ఏడాది క్రిందట లింగప్ప గోపాలరావుగారి బాంకులో వాచ్‌మన్‌గా చేరాడు. ఎనభై ఏళ్ళ వయసు, మోకాళ్ళ నొప్పులు, కూర్చునిలేస్తే బాధతో మొహం చిన్నదవుతుంది. పనిచేస్తేగాని ఇంట్లో గడవనిస్థితి. కొడుకు వోబులేశు సంపాదిస్తున్నా పైసాసాయం చెయ్యడు. వానిది వేరే కాపురం. ఇక్కడ పని ఖాళీవున్నదని తెలిసివచ్చాడు లింగప్ప.సుశీలమ్మకు జాలేసింది. గోపాల్ లింగప్పని పరీక్షించి పనియిచ్చాడు. రాత్రి బాంకులో నిద్రపోతాడు లింగప్ప. పగలు కొంతసేపు ఇంట్లో తోటపని చూస్తాడు. పనిలేనప్పుడు సుశీలమ్మ లింగప్ప కబుర్లు ఉత్సాహంగా వింటుంది. కొండలాగా చెట్టులాగా బుక్కరాయ సముద్రం చెరువులాగా అనిపిస్తాడు లింగప్ప ఆమెకు. ఆ కబుర్లు వింటుంటే ఆమె మనసు ఏదో స్వేచ్ఛను పొందుతుంది. లింగప్ప ముసలితనం, నొప్పులూ అన్నీ విడిపోయి ఒక జీవవాహినిగా మారిపోతాడు. తన బంధువుల్ని, వంశచరిత్రను, యర్రగడ్డను, అందులోని వనాంతరాల్ని, దేవుళ్ళను దేవుళ్ళకు జరిపిన పరషల్ని, తాను తిరిగిన దేశాల్ని, వాసనాజీవులైన జంతువుల్ని, మనిషి జాతిని, దాన్ని నడిపే ధర్మాన్ని—అన్నిటినీ ఆక్రమించుకొంటూ పెరుగుతాడు లింగప్ప.

"ఆ బిటీషురాజ్జెంలో సంగతి...." అంటూ మొదలౌతాయి అతని కబుర్లు సాధారణంగా. అప్పుడు బిటీషురాజ్జెంలో—తొలీత బస్సులు నాలుగు సెక్రాలవే, సిన్నవి. శార్జీలు కూడా దమ్మిడి బొట్టు, అర్థణా—అంతే. రామెసెంద్రప్ప బస్సులో కండక్టరుగా చేరాడు లింగప్ప. అయన ఎత్తారం మడిపి. దూడపాయం, ఎఱ్ఱగా రాజాయకట్టుండేవాడు. "ఒరేలింగా,ఎట్లాగూ దణ్ణంపెట్టినప్పుడు, పెట్టినట్టూ గాకుండా పెట్టనట్టూ గాకుండా ఒంటి సెయ్యెత్తితే పలంలేదు. రెండుసేతులూ నెత్తిపేకెత్తి దణ్ణంపెట్టు'' అని సెప్పినారు. అప్పట్నుంచీ లింగప్ప ఎవరికేనా రెండుసేతులూ పేకెత్తి బుర్ర వొంచి "దొరా" అని దణ్ణంపెడ్తాడు. ఆయన నేర్పిందే అది. దాన్నిచూసే వినయంగల వాడనుకొని పనిలో చేర్చుకున్నాడు గోపాలరావు. అనుకున్న

పని పూర్తిగా వైనంగా చెయ్యడం లింగప్ప స్వభావం. కాని వినయంగా పనిచేసుకుంటూ పోవడం ఒకటే అతని ముఖ్యలక్షణంకాదని త్వరలోనే తేలిపోయింది. ఊరినిండా లింగప్పకు తెలిసినవారే. పని ఒదిలి, నడిమధ్యలో కనపడ్డవాళ్ళతో మాట్లాడటం లింగప్పకో అలవాటు. "మీ వూరిమీద సినుకులు పడ్డయ్యా? వంకలు బారినయ్యా? సెరువుకి నీల్లు ఎన్ని మెట్లొచ్చెయ్యి" వంటి పనికిమాలిన విషయాలు అందర్నీ అడిగి కనుక్కుంటాడు. తనకు తెలిసిందనుకున్న విషయాన్నిగురించి ధారాళంగా సలహాలిస్తాడు. "ఆఫ్టరాల్ పనిచేసే వెధవనని గుర్తుంచుకోడే. బోడి సలహాలిస్తాడు" అని విసుక్కుంటాడు గోపాలరావు.

గోపాలరావు లింగప్పని పనిలోనుంచీ తీసేద్దామనుకునేసరికి సుశీలమ్మ అడ్డుపడ్డది. అపాటికే లింగప్పపట్ల ఆత్మీయత ఏర్పడ్డది ఆమెకు. తన జీవితంలో తాను అనుభవించలేనిదేదో లింగప్ప జీవితంలో వెతుక్కుంటున్నదామె మనసు. లింగప్పలో ఏదో లయ ఉన్నది. సజీవమైనభాష, దానికనుగుణంగా చేతుల కదలిక, ముఖభంగిమ-యీ అన్నిట్లోంచీ ప్రవహించే విషయం-ఆ విషయాన్ని జీవించిన లింగప్ప-లింగప్పా, అతని జీవితమూ వేరుకానేకాదు!

ఒక పాట కచేరీలో బాలమురళీకృష్ణ "ఎందరో మహానుభావులు" పాడగా విన్నది. అతను పాడుతున్నాడు, వింటున్నాడు, ఎందరో మహానుభావుల్ని తలచుకొని ఆనందిస్తున్నాడు.... అక్కడ శ్రోతలులేరు. తానులేదు, అతనొక్కడే వున్నాడు ... అతనూలేడు, పులక శరీరులై యానందపయోధి నిమగ్నులై ముదంబునను యశంబు గలవారే ఉన్నారు.... వాళ్ళూలేరు. ఒక తన్మయీభావం ఒక స్పందనమాత్రం ఉన్నది.... అప్పుడామె కళ్ళలోంచీ ధారాపాతంగా నీళ్ళు కారిపోయాయి.

ఒక్కోసారి లింగప్ప మాటలు వింటుంటే ఆమెకు ఎందుకో ఆనాటి అనుభవం గుర్తుకొస్తుంది. లింగప్ప వెర్రివాడు అని ఆమెకు తెలుసు. "మా మనవరాలికి సెయి కాలిపోతా వుంది" అని వరుసగా నాలుగురోజులు

చెప్పాడు. అయిదోరోజున "సూది ఏయించినా, జెరం తగ్గిపోయింది" అన్నాడు. "ఆస్పత్రికి తీసుకెళ్ళావా" అనడిగింది సుశీలమ్మ. "ఇంటింటికీ వాళ్లే ఒచ్చి మా గేరుగేరంతా పొడిపిపోనారు" అన్నాడు. "అవి కలరా ఇంజక్షన్లు. వాటికీ యీ జ్వరానికీ సంబంధంలేదు" అన్నదామె. "ఏవో, తగ్గిపోయింది" అన్నాడు, జ్వరం తగ్గాక యిహ ఆ విషయం ఎందుకు అన్న ధోరణిలో. లింగప్పమీద జాలి కలిగిందామెకు. "వెర్రి ముపిలాడు" అనుకుంది. ఎప్పుడో ఇట్లాంటి జ్వరంలోనే, తెలియనితనంవల్లనే చచ్చి పోతాడు. మనస్సు చివుక్కుమన్నది. "నాకు జెరంగాత్తే మా ఇంట్లోవాళ్లకు తెలుసు. బాగా వుడుకునీళ్లుగాత్తారు. తానంజేత్తా. రాగిముద్దలో గోగాకు వూరు బిండి పిసుక్కోని తిని, బాగా మజ్జిగ బోసుకుని తినేత్తా. జెరంగిరం యాడికి బోతదో! ఇంగో మందు బనిలే....' జ్వరం అనేది ఒక్కరకమే వున్నట్లు! కాని ఆ వెర్రితనంలోనే ఒక నిండుదనం, ఏదో ఏకత్వం, జీవితంలో నమ్మకం కన్పిస్తుంది. 'మా పెద్దోల్లు—నాయనలు, పెదనాయనలు—గుంపు పెద్దది. యాభై మందిలు. మా వోమిశానికంతా నేను మిగిల్నాను. మా మేన మావల ఇంటికి ఒకడు మిగిలినాడు, తక్కిన జనాలు యాడబోయినారో.... ఎన్ని లాసులు యీ సేతలమీద మోసినావో. ఎక్కడ ఎవరు సచ్చినా ఎనిక్కి తీసేదిలే. పదా అనేదే....' అతని గొంతు తగ్గిపోతుంది. కాని అందులో జాలిగాని దుఃఖంగాని వుండదు. తల వూపుతూ దీర్ఘంగా అంటాడు 'దెసె లోల్లం ముందుకి కాటి దిక్కుకు పోవల్సినోల్లంగెదా'. సుఖం, దుఃఖం, జబ్బు, చావు—అన్నీ జీవితంలో భాగమే లింగప్పకు.

'నాకో?' అనుకుంటుంది సుశీలమ్మ. 'పీనుగువెళ్తుంటే చూడ కూడదు. చిన్నపిలలు జడుసుకుంటారు'. నావికాని విలువలకోసం నాదికాని జీవన విధానంలో సాగుతూ, అర్థం కాని దానికోసం అర్థమయ్యేదాన్ని విడిచి, జీవంకోసం చూడబోయి జీవితాన్నే పోగొట్టుకుని....'నాకు జీవితమే మృత్యువులో భాగం?' అనుకుంటుంది విరక్తితో.

# 2

"తొలీత వూళ్లో పార్టీలు పడతారు. సదువులకని పిల్లలు, అంబడీత ఒక ముసిల్ది ఒచ్చి సంసారం పెడతారు. తరవాత ఒక ఎనుంగొడ్డునిపట్టి పాలమ్ముతారు, రాంగ రాంగ వూళ్లోని బూమీ యిల్లూ అమ్ముకొని ఇక్కడే సెరిపోతారు. నీదేవూరంటే అనంతపురం అంటారు. ఎవురైనా అడుగు. నీదే వూరంటే అనంతపురం అంటారు.'అసులా'. అని అడుగుతా 'అవును. అసులే' అంటారు. అప్పుడు నేను వాళ్లని ఒకటే మాటడుగుతా "నీది మొదుట్నించే అనంతపురమైతే తొలితొలీగ యీ వూరెంతుండిందో సెప్పు. అప్పుడు వాల్యూవుండిన మడుసు లెవరో ఇప్పుడెవరో సెప్పు' అని 'ఆ, నే ఒచ్చి ముప్పై ఏళ్ళయింది....నీదేవూరు' అంటారు. 'మాది యావూరో! .... ఎక్కడనుంచీ ఒచ్చినానో' అంటా...." వినయంగా వంచిన తలని వూపుకుంటూ నవ్వుకుంటూ బోడినెత్తి తడువుకుంటాడు లింగప్ప. అనంతపురమూ లింగప్పా ఎనభై ఏళ్ళూ కలిసేవున్నారు.

శామీలని ఇంజనీరు దొర, ఎత్తారం మడిసి, టోపీ పెట్టుకొని, గొడుగు కర్రాయకట్టు ఒంకీకర్ర పట్టుకుని బేజోరుగా నడుత్తాడు—ఆయన కట్టిందే రేలుటేషను. ఆయన గుంటూరు టాన్సపరై పోతా 'నా దెగ్గిర పనిత్తా. పనిత్తా, రారా కరవోడా' అన్నాడు. అప్పుడు లింగప్పకి దూడ పాయం. అయినా పోలా. అయిన వూరిడిసి పెట్టి యాడికిపోతాడు!

ఇప్పుడు లింగప్ప ముసలివాడు. పొట్టిగా గట్టిగా కుదిమట్టంగా కన్పించినా వయసుతోపాటు శరీరంలో కండ హరించుకుపోయింది. అమాలీలందరికీ ఒచ్చేదే—మోకాళ్ళు ఇంతలావున వాచి సలుపుతూ పీకుతూ వుంటాయి. కుడికాలు పేనుంచీ కిందిదాకా యీడుత్తుంది. పని చెయ్యకపోతే జరగదు. తండ్రి అంటేనే కంపరం వోబులేశుకి. ఎన్ని అవకాశాలు పైకి రావడానికి! సరైనపని ఒక్కటీ చెయ్యలేదు లింగప్ప. 'అప్పుడీ వూరెంతుంది? పాతూరే. జీనియర్ కాలోజీ వుండేసోటు అడివి. చెట్టు పలం

జాత్తి. సరిసౌకం రూపాయికిత్తా. తీసుకోమని సుబ్బయ్య బంగపాయె. నాకెందుకీ యడివిలో అని తీసుకోకపోతి. ఇంజినీరు కాలోణీ దెగ్గర ఎకరా అయిదు రూపాయిలకిత్తా. మీ కురవోల్లకి పని కొత్తదని కుప్పాళారి అడుక్కునె. మనిసీ మానూలేని ఎబ్బెట్టుసోటని ఒద్దనేత్తి' వోబులేశుకి విన్న కొద్ది మండుకొస్తుంది. సరిగ్గా తెలివిగా వ్యవహరించివుంటే యీపాటికి తాము పెద్దోళ్ళుగా వుండవలసింది! లింగప్ప చింతలేకుండా చెప్పుకుపోతాడు. 'నేను చూడంగానే యీ అనంతపురం ఎన్ని రకాల మారింది! పెద్దోళ్ళు దివాలాతీసిపోనారు. సన్నజనం పేకెక్కి మాడీలమీద మాడీలు కట్టినారు. కిట్టప్పని తొలీత యీ వూల్లో వోటలు బెట్టినాడు. ఆ యమ్మకి పెయినిండా బంగారే. ఒక బవంతి గట్టినారు — గోడల్లో తంబాల్లో నీడలు గనపడేట్టు కట్టినారు. ఏమి దర్బారు జరిగింది! ఇప్పుడయ్యాన్ని యాటికి బోయినయ్యో! ఆయమ్మ యీ వూల్లో అడక్కతింటావుంది. అప్పుడు బేట వరండాలో బొరుగులమ్ముకుంటున్న కదిరి సేనప్ప ఇప్పుడు శేషారొడ్డి. యమ్మెల్లే ఇప్పటోల్లు పేకిలేత్తనారు — దొంగ డబ్బులోల్లు. కల్లమ్ముకునే వోల్లు. మట్కా ఏజెంట్లు...."

'నీవు మాత్రం అట్లాగే అడుగునే వున్నావు' అంటాడు వోబులేశు కసిగా.

లింగప్ప జీవితంలోని పెద్ద ఆపద ఆ కొడుకు అని సుశీలమ్మ అనుకుంటుంది. "ఇటువంటి కొడుకుల్ని కష్టపడి పెంచి ఫలమేమిటి లింగప్పా" అన్నదోసారి.

"పెంచాల్సిన పద్ధతి వుంది గనక పెంచుతాం. తరవాతకి ఏంచేత్తారు. ఎట్టవుతుంది, అనుకుంటామా?....ఇంత జనాలు ఎందుకు పెంచుతున్నారు? వాల్లు బిడ్డాపాపల్తో సుకంగవున్నారు. మనకులేరని గుల్లు గోపరాలు తిరగతా రెందుకు?....మన పెద్దోల్లు మనన్ని ఎందుకు పెంచారు?....ఇది ఎన్నో తరాలుగా వత్తన్న పద్ధతేగందా....పలం సూసుకుంటే?....పిల్లలే ఒద్దనుకుంటే?...." ఇదేం వెర్రి ప్రశ్న అన్న ఆశ్చర్యంలో మునిగిపోయాడు

కాసేపు. "వూరికే బువ్వతిని ఇంటో సేతులు ముడుసుకు కూసోవాలా? పిల్లి కోడి, కుక్క, నక్క అన్ని జీవులకీ వుండేదే గందా? రెక్కలొచ్చేదాకే పెంచాలి. ఆ పేన దేవుడు ...మనిసి పుట్టిందెందుకు?....' ఇంతకంటే ఎక్కువగా ఆలోచించలేక, ఆమె ముఖంలోకి దీర్ఘంగా చూశాడు. 'కాలం మారిపోతావుంది. మంచి సెడ్డ పాపం పున్నెం లేకపోనాకా నాయనేంది? కొడుకేంది? ... నేనేమో మా యమ్మయ్యకి సేతనయినయ్యన్నీ సేసినా. దెశెలు అయినాక మంచంలో జెరంతో వోరం రోజులుంది. పియ్యెత్తేదెగ్గిర్నుంచీ అన్నీ సేసినా. అంగిట్లో నుంటీ మిటాయి, జిలేబి, కారాబూందీ అన్నీ పొట్లాలు గట్టించి తీసుకెళ్ళి పెట్టినా. నాకేం అక్కర్లేదని తలూపింది. అయినా అన్నీ తినిపించినా, సచ్చినంక రాత్రంతా బజన పెట్టించినా, జనానికంతా పేదసాదకి బాగా పెట్టినా...." ఉత్సాహంగా చెప్పుకుపోయాడు.

గొర్రెల్ని మేపుకుంటూ యర్రగెడ్డంతా తిరిగాడు లింగప్ప 'గార్లదిన్నె, కనంపల్లి, తలగాసుపల్లి, గుమ్మేపల్లి, పోతురాయి, నాగసంద్రం, వంకిరేసు కాలవ, అంతరగంగ, కలగల్ల, ఉప్పేరు....నోటితో యావను పోమ్మయ్యా, అయన్నీ వున్నై యీ గెడ్డన....'వూళ్ళ పేర్లన్నీ చాక్లెట్లు చప్పరించినంత ప్రీతితో నోరు ఆడిస్తూ వల్లిస్తాడు. అనంతపురం గురించీ అదివున్న యర్రగడ్డ గురించీ ఎవరైనా ఏ కొంచెం ఆసక్తి చూపినా కుసుకుతున్న కళ్ళల్లోకి చివ్వున పొంగివస్తుంది జీవం. అతని జ్ఞాపకాల్లోని ఒక్కో విషయం, అతని జీవితంలోని ఒక్కో ముక్క, యర్రగెడ్డ చరిత్రలోని ఒక్కో భాగం. అందులో స్వేచ్ఛగా తిరిగిన కురవల జీవితాల్లోని విశేషాలు —తిరిగి జీవిస్తాయి. యర్రగడ్డ అతని తల్లి. ఆ బూవమ్మ బిడ్డ అతను.

"మా కురవోల్లలో పొద్దున్నే మొగంకడిగినో డెవరు? లేసేది, సద్దిదినేది, సేతులు గొర్రెలకి రుద్దేసి, మూత్తుడుసుకుని పోతావుండేది. నీల్లు —నీల్లెక్కడ దొరుకుతై వనంతరాల్లో దిరిగే వాల్లకి? వున్నప్పుడుంపై, లేనప్పుడుండవు. అందుకే మా కురవోల్లు దప్పిని సంపేత్తారు. తొలీతే ఎక్కువ నీల్లు తాగరు. వున్నయ్యని ఇప్పుడు తాగితే లేనప్పుడెట్లా...."

"పెక్కంలో ఆడోల్లు బువ్వదెత్తె ఎంతమంది బీదాబిక్కీ మేవుండే తావు ఎతుక్కుంటూ ఒచ్చేవోల్లు! లేదనకుండా అందరికీ పెట్టాల్సిందే. పిల్లలున్నారంటే పాలు తిరిపెంగా పొయ్యాల్సిందే...."

"ఒకపాలి డొక్కల పెరువుకాడికి మంద దోలకపోయినం. మాల పున్నమి. పెదబోయోల్లంతా ఎనబై మందొచ్చిన్రు. తలాక తిరిపెంపిల్ల లియ్యమని. యాడదెచ్చిత్తుం అన్నిపిల్లలు! 'మేం ఒగిటిగూడ యీము. మొబ్బులో గావాలంటే మందంతా దోలకపోన్రి' అనేసినం. వాలు పరాక్రమం సేయబట్టినరు, 'యాగెడ్డ కురవోల్లురా మీరు' అంటా. 'యర్రగెడ్డ కురవోల్లంరా' అని మేం పదిమందిం. ఇంతలో ఆ దోవంటె పోలీసుజీపు బోతంటె వాల్లు తగ్గి 'రెత్తిరికొచ్చి ఎత్తకపోదామి' అని మల్లినారు. మేం మందలేపుకొని ఇంకో దోవన మల్లొచ్చినం...."

దూడపాయంలో లింగప్ప బవుబింకంగా వుండేవాడు. తుమ్మదిగాని యీతదిగాని, సిగరదిగాని, గిరుసుకట్టెగాని సొక్కాలేకుండా వుత్తపేన ఇరగ్గొట్టేవాడు. తిండి బేదినేవాడు. లారిల్లో కీనరుగా బోతా మదరాసుదాకా తిన్నాడు. ఒపిపేటదాకా దిన్నాడు. వోటల్లో తొలినాడే అన్నం పెట్టేది. తరవాత మొగం చూపి లేదనెత్తారు. కల్లంగడికిపోతే ముంతతో కల్లిత్తే అది తాగి, ముంతని కూడా నములుకొని తినేవాడు. దాన్నుంచే లింగప్పని గనుక్కోని వాల్లు ముంతలియ్యరు. సీసాలిత్తారు.

'ఒక పాలేవయిదంటే ఒక పల్లెలో వోటలోడు అన్నం వొండి మా ఆరుగురికీ బెట్టినాడు. అందరూ దిని లేపిపోయినారు. నాకు సాలలా. ఆడు అన్నం లేదనేసినాడు. నాకు మారు పెట్టేదాకా లెయ్యనని కూసున్నా. తాగిన మంపరం. తక్కిరి బిక్కిరి. వాడు పెట్టాలా. నాకు కోపవొచ్చి ఆరిత్తరాకులూ పిండిజేసి తింటి. ఈనెలు గీనెలు అన్నీ నములుకోని తింటి. నా యిత్తరాకు దోసె బీక్కుని తిన్నట్టు తింటి. ఇంకా గబ్బు లేపతా మాదని వూల్లోకి బోయి ఒక గాడిదని బుజాలమీద కెత్తుకుని మోసుకొచ్చి వాడింటి ముందెత్తి. అప్పుడు వాడు మల్లీ అన్నం సేసి యిచ్చినాడు మూటగట్టి....

వూరు జేరినంక మూడుముంతలు కల్లుదాగి, ముంతలు దిని, ఒకటిన్నర దరాము సారాయి దాగినా. పావలాకు గంప కురాకు దీసుకొని తింటి. కడుపు నొప్పి ఎత్తుకుంది. ఇంటికి బోయినా'.

అతి సామాన్యపు జీవితం. అధమాధమపు జీవితం కూడా. 'కాని అది చావు తాకలేని జీవితం. నిరంతరం ప్రవహించే జీవవాహిని' అను కున్నది. దానిలో ఎంత నవ్వు! 'సెప్తే నగుతారు. నాకే నగొస్తావుంది....' ముసలి మొహంలో నవ్వు విరిసి, విరిగి ముసలి కళ్ళల్లో నీళ్ళూరుతాయి. తలకిందికి దించేసి బుజాలు ఎగిరిపడేలా నవ్వుతాడు. 'ఆ బిటేసు రాజ్జెం సంగతి....మదరాసు బీసికి బోయినం. అప్పుడు రొండణాల కొక టవులు. కొత్త టవులు నేలమీదేసి, బొరుగులు వుట్నాలు కొనిపోసి సవద్రంయేపుకి యీపుతిప్పి బొరుగులు నవులుకుంటూ బీసిలో ఆటలాదేవోల్లని సూత్తూ గూసున్నాం. వాల్లు మెమ్మల్ని సూచి వూరికే నవ్వనుబట్టినారు. వారు నవ్వు తుంటే ఎందుకో తెలీకుండానే మేవూ నవ్వుతుండాం. మా పెద్దపెద్ద కొప్పుల్ని సూసి నవ్వుతూండారనుకున్నాం....ఆడోల్లకి గూడా వుండవు అంతపెద్ద కొప్పులు. ఇంతలో ఎనక్కి తడి తగిలింది....ఎనక్కి తిరిగి సూద్దుం గెందా. రొండణాల టవుళ్ళు బొరుగులు అన్నీ సముద్రంలోకెల్లి పోయె. వాల్లు నవ్వా మేం నవ్వా....' లింగప్పా. సుశీలమ్మా ఒకర్నొకరు చూపి ఒకటేగా నవ్వుకుంటారు.

'అమ్మోవ్, యియ్యాల మెమ్మల్ని బోజినానికి బిలిస్తివంట, నాగప్ప జెప్పాడులే' అంటాడు పండగనాడు. పనిమనిషి ఎంకమ్మ గాబరా పడతది. 'ఎవురూ జెయ్యలేని వంటలు జెత్తావంట....యాపాకు పాయాసం, మోద గాకు వడలూ....' నవ్వుతో బుజాలూ తలా వూగిపోతై. ఇంకా నవ్వుతూనే వుంటాడు. 'అయ్యిమాత్తరం వూరికే ఒత్తాయా యీ కాలంలో' అంటూ మొహం ముడుచుకొని వెళ్ళిపోతుంది ఎంకమ్మ.

"ఫలానా మనిషి ఎలాంటివాడు?" అని అడగ్గానే లింగప్ప ఆలో చనల్లో పడతాడు. పెద్ద తలగుడ్డ కిరీటాన్ని పైకెత్తి సర్దుకుంటాడు, కళ్ళ

పైకెత్తి జ్ఞాపకాల అరల్లోకి తొంగిచూస్తాడు. 'ఎవురికీ ఏపీ అన్నాయం సెయ్యలేదు. ఎవురినోరూ కొట్టలా!' అంటాడు తలాడిస్తూ. అదొక్కటే లింగప్పకు తెలిసినవిలువ!

దీర్ఘమైన జీవితంలో అతనివలన కొందరికి సహాయం జరిగింది. తల్లి చచ్చి ఆస్పత్రిలో దిక్కులేకుండా వున్నపిల్లను పేదపిల్లల హాస్టల్లో చేర్పించాడు. ఆ పిల్ల ఇప్పుడు హిందీ టీచరుగా వుంది. ఒకసారి దోవతప్పి ఏడుస్తూన్న పిలగాణ్ని బస్సుఛార్జిలిచ్చి వాళ్ళవూరికి పంపించాడు. దొంగలు పట్టుకుపోతున్న పిల్లని విడిపించి దొంగని చిదకదన్నాడు. పెళ్ళిళ్ళకి బొట్లు చేయించుకోడానికి ఎందరికో సాయంచేశాడు. అయినా లింగప్పని 'మంచి వాడు' 'పరోపకారి' అనటానికి వీల్లేదు! అన్నీ యాదాలాపంగా జరిగినవే గనుక.

## 3

గణేశుడి దేవాలయానికి కొంత డబ్బు విరాళంగా యిచ్చాడు గోపాల రావు. ఆ డబ్బుతో పెద్ద పఠాలు తెచ్చారు, గోడలకు అలంకరించడానికి. దేవుళ్ళ బొమ్మలు, మహా పతివ్రతల చిత్రాలు, నరకంలో పాపులు నానావిధా లైన హింసలకు గురియవుతూ వుండడం, ఏఏ పాపాలకి ఏఏ శిక్షలో అన్ని వివరంగా చిత్రించి వున్నాయి. సుశీలమ్మకు ఆ పఠాలు నచ్చలేదు. కాని గుడికివెళ్ళే జనం కళ్ళు మూసుకుని దేముడిముందు అయిదు నిమిషాలు నిల బడితే, ఆ పఠాలముందు కళ్ళు తెరచుకుని పదినిమిషాలు నిలబడతారని ఆమెకు తెలుసు. అక్కడేవో పూజలు చేయించడానికి సాయంత్రం ఆరు గంటలకు వెళ్దామని చెప్పాడు గోపాల్. బాంకులో అప్పు తీసుకుని తిరిగి ఇవ్వకుండా ఎదురు తిరిగి మాట్లాడుతున్న వాళ్ళిద్దరి మీద కేసులు పెట్టి డిక్రీ తెచ్చుకున్నాడు యీ మధ్యనే. దాని తాలూకు పూజలు ఇవాళ.

ఆరున్నరవుతున్నా గోపాల్ ఇంకా ఇంటికి రాలేదు. సుశీలమ్మకు గుడికి వెళ్ళాలనిగానీ వెళ్ళకూడదనిగానీ ప్రత్యేకంగా ఏమీ అనిపించలేదు.

మా వూళ్లో వరసనేపిత్తాం అంటే యీనంటానికి యీల్లేదు. యియాల్సిందే. సొమ్ములన్నీపెట్టి పాలకిలోపెట్టి పంపిత్తారు. దొంగలొచ్చి నడిమెద్దెన అడ్డగిత్తే? సామినిదించి 'ఎవరిగ్గావాలో ఎత్తకపోన్రి. నిచ్చేపంగా ఎత్తకపోన్రి' అంటారు. ఎప్పుడూ ఎత్తక పోలేదు. ఒకపాలి నలుగురు దొంగలు ముట్టినారు. కల్లుగనపడక దిక్కులకోడు బరిగిత్తె. అంత సత్తెం సామిది!...."

"ఇంకా రెడీకాలేదా? కేసు వోడిపోయిన కదిరికాపు వాళ్లొచ్చిపడ్డారు. వెధవ బెదిరింపులూ వాళ్ళూనూ. పోలీసులకు ఫోన్‌చేసి వాళ్ళను బయటికి నెట్టించేసరికి ఆలస్యమైంది...." అంటూ లోపలకొచ్చాడు గోపాల్రావు. లింగప్పనుచూచి నొసలు చిట్లించాడు. సుశీలమ్మ లింగప్పతో సమానంగా మాటాడుతూ వుండటం ఆయన కిష్టంలేదు.

"బెణకప్ప గుడికెల్తావా అమ్మా" చిన్నగా అడిగాడు లింగప్ప. అంతవరకూ గోడకానుకొని ఒంటికాలిమీద ఒరిగి నిలబడి చేతులాడిస్తూ ధీమాగా మాట్లాడుతున్నవాడు, గోపాల్ కనబడగానే నిటారుగా నిలబడి గొంతు తగ్గించుకున్నాడు. సుశీలమ్మకు నవ్వొచ్చింది.

గణేశుణ్ని వాళ్ళు బెణకప్ప అంటారు. గణేశుని తలచుకోగానే ఆమెకు ఆనందం కనిగింది. ఆయన్ని రాతితో చేశారు, కంచుతోచేశారు అని ఎవరు అనుకుంటారు! సకలలోకాలకు ప్రభువు-పార్వతీ తనయుడు. కల్యాణ గుణాలయుడు....

చకచకాలేచి పదినిముషాల్లో తయారైంది. భర్త ప్రక్కనే కారులో కూచుని గుడికెళ్తుంటే మనసు ఏవో ఉన్నత శిఖరాలపై నిలిచింది. భార్యాభర్తల సంబంధం—ఆత్మపరమాత్మల సంబంధాన్ని సూచించే మహత్తరమైన బంధం—ఈ అవున్నత్యాన్ని లింగప్ప ఎన్నడూ వూహించలేడు! చెప్పినా అర్థం చేసుకోలేడు! "కురవోల్లు సీరలు మారుత్తారు."

పూజ అయ్యాక చెరువుగట్టుమీద కొంచెంసేపు కూర్చున్నారు. ఎనిమిది దాటింది. గుళ్ళో జనంలేరు. పూజార్ల అలికిడి కూడా లేదు. ముష్టివాళ్ళూలేరు. చంద్రుడి వెన్నెల గుడ్డిగావుంది. లేచి కారుదగ్గరకు

బయల్దేరారు. చెట్లక్రింద చీకట్లలోంచీ నలుగురు మనుషులు వచ్చి చుట్టు ముట్టారు. ఇద్దరు గోపాలరావు నోరు మూసేసి చెట్టుకుకట్టారు. మిగతా యిద్దరు సుశీలమ్మని పట్టుకుని నగలన్నీ ఒలిచేశారు. ఆమెను క్రిందికితోసి చేతులూ కాళ్లూ పట్టేశారు. "ఏవండి" అని కేకపెట్టి తన్నుకుంటున్న ఆమె నోట్లో గుడ్డలు కుక్కారు....ఎవరూ ఆమెను రక్షించలేదు ...

హాస్పిటల్లో తెలివొచ్చింది. జరిగింది సరిగ్గా జ్ఞాపకంలేదు. పట్టరాని ఏడుపు. గుండెల్లో మంట. ఒళ్ళంతా మంట. లోపలి మంటలో దేని కోసమో వెతుకులాట.

నేను....నేను?....సీత....ఎవరు మైలపడిపోయింది?

మెదడులో అగ్గిపర్వతం బ్రద్దలైంది.

ఛీ, ఈ శరీరం నాది కాదు.

ఇది మురికి, పెంట, కుళ్ళు, అసహ్యం.

దుఃఖం, బాధ, కసి, ద్వేషం....

ఇది నశించిపోవాలి. కుళ్ళు నాశనం చెయ్యాలి. మంట ఆరాలి....

అందరూ "ఏమరి వున్నప్పుడు బయటి కెళ్ళింది. బావిలో దూకింది, ఎవరో పెద్దగా అరిచారు.

తెలివచ్చేసరికి మళ్ళీ మంచంమీదే వున్నది.

బరువు. ఆయాసం. ఊపిరికోసం, ప్రాణశక్తికోసం గింజు కుంటోంది శరీరం.

మెల్లగా కళ్లెత్తి చూసింది. గోపాలరావు కనిపించాడు. అతన్ని పరీక్షగా చూసింది. "నేను చావాల్సిందే" అనుకుంది. బ్రతికి ఏం చెయ్యాలి? ఆమె సుశీలకాదు. మంచం దగ్గర లింగప్ప కాపలా వున్నాడు. "ఎండ్రిన్‌గాని ఏదైనా గుక్కెడు విషం తెచ్చిపెట్టు, లింగప్పా" అన్నది. కునుకులోంచీ మగతగా విన్న లింగప్ప గోడకు జారగిలబడి తలగోక్కుని "పానం పోగొట్టుకోటం ఏలనమ్మ. ఎందరు జనాలు బ్రతకటంలేదు! దేవుడు పెట్టినయ్యన్నీ అనుబగించాలిగెదా" అన్నాడు.

దేవుడు! ఆ పేరెత్తితేనే ఆమెకు కష్టపుట్టింది. ఎవడు దేవుడు? ఎక్కడున్నాడు? వాడి న్యాయం ఏమిటి? నిజంగా దేవుడనే వాడుంటే గుడి ముందే ఇటువంటి అత్యాచారం జరుగునా?!

అత్తా, ఆడబిడ్డా వచ్చారు. కన్నీళ్ళు కార్చారు. "ఆ ప్రాణం అప్పుడే పోయుంటే బాగుండేది. ఏం పాపం చేసుకున్నావో ఖర్మ" అన్నారు.

నాన్నగారూ అన్నాచెల్లెలూ వచ్చారు. తనకోసం బాధపడి ఏడ్చారు. కాని తనని బ్రతికించగలమాట వాళ్ళదగ్గరలేదు.

గోపాల్ యిహ ఎన్నటికీ తనను "సీతా" అని పిలవడు.

"నా జీవితం నాశనమైపోయింది. నేను నశించిపోయాను" ఆమెకు అలవిగాని దుఃఖం ఆవేశం వచ్చాయి. "నేను సుశీలను. నన్ను ఏ మలినమూ అంటలేదు. కావాలంటే అగ్ని పరీక్షపెట్టండి. నాకేమైనా పాపం అంటితే మసైపోతాను....నేను సీతను. నిప్పులాంటిదాన్ని. నేను అప్పుడూ యిప్పుడూ ఒకటిగానే వున్నాను."

అయినా గోపాల్ తనను గుర్తించడు! అతను ఎవరో పరాయివాడిలాగా సంబంధంలేని వాడిలాగా అన్పించాడు. ఇన్నాళ్ళు బ్రతికిందంతా వూహేనా?

ఈ మనిషి, ఇంకో మనిషి, అందరు మనుషులూ తనను వెలివేశారు....

తనను తానే వెలివేసుకుంది.

"లింగప్పా, నాకేమైనా తెచ్చిపెట్టు" అన్నది ఏడుస్తూ.

"ఏలనమ్మా, ఊరికే వత్తానంటావు? ఈ ఊళ్లో వుండలేకపోతే మా వోల్లకాడికి కుంటిమద్దికి పంపిత్తా. అయిదరాబాదలనుంటీ ఒచ్చినావని సెప్తా. మా కోడలు సుట్టంరాలివని యాదో నేసెప్పుకుంటా. నీకేల అదంతా. బతకటానికి సోటేలేదా?" అన్నాడు.

లింగప్పకేమీ తెలీదు, బ్రతకటం తప్పించి.

బ్రతుకు! ఇంకా బ్రతుకు! నూరేళ్ళు బ్రతుకు!

ఇంత ప్రపంచంలోనూ లింగప్ప ఒకడే ఆప్తుడుగా కన్పించాడు.

కాని.... బ్రతకటమా?.... ఎట్లా.... ఎందుకు?....

కళ్ళుమూసుకుంది.

ఒంపులులేని బాటలో పచ్చని పైర్ల మధ్యగా ఆకాశం క్రింద నడుస్తూ చల్లనిగాలులు ఒంటిమీద ఆడుతుంటే తాతదగ్గరి కెడుతున్న ఒక ఆనందం—

పాల సపోటాల గంపముందు కూచుని ఆ రుచిలో వాసనలో లీనమై వరుసగా తింటున్న ఒక మాధుర్యం—

"దేవుడూ, దేవుడూ, మా అమ్మ నీ దగ్గరి కొచ్చిందా? నీవెప్పుడూ నా దగ్గరుంటావా?" అని కన్పించని దేవుణ్ని ప్రశ్నిస్తున్న ఒక దుఃఖం—

"ఎందుకు ఇప్పుడీ జ్ఞాపకాలు వెలికివచ్చాయి? ఇవి నాలోవున్నాయని నాకే తెలియదే!" అనుకుంది.

లింగప్ప లేనప్పుడు మెల్లగా లేచింది. సంధ్యవెలుగులోనికి వెళ్ళిపోయింది.

చెరువు ఎండిపోయి వున్నది.

కట్టమీద నిల్చుని ఆకాశంవైపు చూచింది. పెద్దగోళం—అనంతమైనది, కదలనిది, మారనిది—మాతృ గర్భంలా తనను చుట్టుకొని వున్నట్లనిపించింది. అట్లాగే చూస్తూ నిలుచుంది. ఆ కదలని దాన్లోనే దిగిపోయే సూర్యుడు, ప్రాముఖ్యతలోని కొస్తున్న చంద్రుడు, కళ్ళు తెరుస్తున్న నక్షత్రాలు—వెలుగులో క్షణక్షణం మారుతున్న ప్రపంచం—అంతా తన చుట్టూ—ఈ విశ్వానికి కేంద్రం తానే!

ఆమెకు సంతోషం కల్గింది. మనసు తేటపడింది. గుడిదగ్గర గట్టు మీదనే ఎంతోసేపు నడిచింది. "నాకు అంటిన తప్పు ఏది" అని తన్ను తాను చూచుకున్నది. "నాకు తప్పు అంటితే నాలో ప్రాణం ఎందుకున్నది? ప్రాణం భగవంతుడు కదా?" అనుకుంది.

భగవంతుడికి తప్పు ఒప్పులేవు. పాపం పుణ్యంలేవు. ఆయనే అఖండమైన ప్రేమ. అనంతమైన కరుణ.

ఆమె మెదడులో గొప్ప కంపం కలిగింది.

ఆనందమో ప్రేమో ఉన్మాదమో—ఏదో తెలియరానిది వెల్లువలా పొంగింది.

అష్టమి చంద్రుడు చచ్చిపోయాడు.

ఆమెకు చీకట్లో ఎదుర్రాయి తగిలింది. బోర్లాపడి క్రిందికి దొర్లిపోయింది. రాళ్ళు తగిలినచోట చర్మం చీరుకుపోయింది. కాని ఆమెకు నొప్పికాని భయంకాని అనిపించలేదు. ఏమీ తెలియరాని స్థితిలోకి వెళ్ళిపోయింది....

---